# మారే జీవితదృశ్యాలు

కొండముది హనుమంతరావు

**కథానిక**

సాయంకాలం నాలుగుగంటలు అయేసరికి మధ్యాహ్నం రెండింటికి కాఫీ తాగటంవల్ల వచ్చిన ఇన్స్పిరేషన్ కాస్త ఖర్చయిపోతుంది ఆనందరావుకు. అతని శరీరంలోని అణువణువూ విశ్రాంతిని కోరుతుంది. ఆఫీసు గడియారం అయిదు గంటలెప్పుడు కొట్టుతుందా అని వేయికళ్ళతో దాని వంక చూస్తూ కూర్చుంటాడు. ఆ శుభ ఘడియ రానేవస్తుంది. ఫైల్స్ ప్రక్కకినెట్టి కుర్చీలోంచి లేస్తాడు.

కె. జి. హెచ్. డౌన్‌కు వస్తాడు. టవర్ క్లాక్ చూస్తాడు. అయిదుగంటల రెండునిముషాలవుతుంది. 'రెండునిమిషాలలో ఫర్లాంగెలా నడిచానా'అనుకుంటాడు. వెంటనే గుర్తుకొస్తుంది—ఆ గడియారం సత్య హారిశ్చంద్రునడుగుజాడల్లో నడుస్తుందనీ, అందుకనే ఎప్పుడూ అదేటైము చూపిస్తుందనీ.

అంతలోకి ఒకబస్సువచ్చి ఆగుతుంది. అమ్మాయిలు దిగుతారు—గాజుల గలగల, నవ్వుల పకపకలతో-చల్లని వెన్నెలలు కురిసినట్లవుతుంది. వారిముఖాల్లో ఏమాత్రం విచారం ఉండదు—ప్రపంచంలో గల ఆనందం అంతా ఆ సుందరవదనాల్లో ప్రతిఫలిస్తుంటుంది. వాళ్ళనుచూసేసరికి ఆనందరావుకేదో అవ్యక్తానందం కలుగుతుంది.

కొందరిచేతుల్లో రికార్డ్ బుక్స్ ఉంటాయి—వాళ్లు సైన్స్ స్టూడెంట్స్ కాబోలు. ఆనందరావుకి 'సైన్స్'అంటే చాలా అభిమానం, అభిరుచీ. తనింటరులో సైన్సు గ్రూపే తీసికొందామనుకున్నాడు. కాని ఎందుకో కామర్స్ తీసుకొన్నాడు. ఆకామర్సే తనకీ గుమాస్తా ఉద్యోగం యిప్పించింది. సైన్సు తీసికొంటే తనేంచేసేవాడో? తనోసారిఎందుకో లెబరేటరీకి పోయాడు స్నేహితునితో. వాడు రెండు పదార్థాలు—ఒకటి రంగుది, దానిపేరు పొటాషియం పెర్మాంగనేట్ ట, రెండవది రంగులేనిది, సల్ఫ్యూరిక్ యాసిడ్ ట—టెస్టుట్యూబ్‌లో కలిపాడు. వెంటనే పొటాషియం పెర్మాంగనేట్ రంగు కాస్తా పోయింది. ఏదో అలాంటి ప్రయోగాలు చాలా చేస్తారుట, ఆ చేసినవి రికార్డ్సులో రాస్తారుట ఈ అమ్మాయిలు కూడా అంతేకాబోలు! తన చెల్లెలిని కూడా చదివిస్తే ఎంత బాగుండేది. అనుకుంటాడు. వెంటనే అమ్మ అన్నమాటలు—"మనలాంటి వారం పెద్దచదువులేం చదవగలం. ఉద్యోగంలో చేరమ్మా!"—గుర్తుకొచ్చాయి. దాంతో ఆనందరావుకి ఆ అమ్మాయిలమీద గౌరవంఏర్పడుతుంది- "అంత ఖరీదయిన చదువు" వాళ్ళు చదువుతున్నారు కదా అని.

అలా వాళ్ళు నడుస్తుంటారు. వాళ్ళకు నాలుగయిదు గజాలు వెనగ్గా ఆనందరావు కూడా నడుస్తాడు. పోస్టుబాక్సు ప్రక్కనే ఒక అబ్బాయి కూర్చొని ఉంటాడు. ఉదయం పదింటికి తనాఫీసుకు పోయేటప్పుడు ఉండడు. మరి ఎప్పుడు వస్తాడోగాని పాపం! అతనికి ఒకకాలు మెలికబడి ఉంటుంది. నోరు తెరిచి "బాబూ" అని కూడా అనలేడు. జాలిగా చేయి జాపుతాడు. రూపాయి నాణెం పడుతుందా అబ్బాయిముందు. ఆ అమ్మాయిలలో ఎవరేస్తారో ఆ రూపాయి ఆనందరావు కర్థంగాదు. 'రోజుకొకరిస్తుంటారు కాబోలు'అనుకుంటాడు. ఆ అమ్మాయిల మీద గౌరవం ద్విగుణీకృతమవుతుంది. తనవంతు వస్తుంది. తనూ ఒక అణా జాగ్రత్తగా వంగి చాపిన చేతులోవేస్తాడు. వంగకుండా లేస్తే ఆ అబ్బాయికి దెబ్బతగులుతుందనే భయంతో ఆ అబ్బాయికళ్లలో కృతజ్ఞత కనబడుతుంది. "మీ అమ్మా, నాయనా ఉన్నారా? ఉంటే ఏంచేస్తుంటారూ" అని అడుగుదామనుకుంటాడు ఆనందరావు. ఆ అబ్బాయి మాట్లాడగలడో లేదోకూడా తెలియదు. అమ్మో! మాట్లాడలేకపోతే ... దారుణంగా ఉంటుందా దృశ్యం! అందుకనే ఆ అబ్బాయిని ఏమీ అడగటానికి సాహసించడు.

రోడ్డుమలుపు తిరుగుతుంది ఆ మలుపులో ఇద్దరు విద్యార్థులు నిలబడి ఉంటారు. ఒకనిచేతిలో

రాకెట్ మరియొకని చేతిలో 'హిందూ' పేపరు ఉంటుంది. నీట్ గా తయారయి ఉంటారు. అంగుళం ఎత్తున అద్దుతారు స్నో పౌడర్లు; బూట్ మీద పాపకనబడేలా పాలిష్ కొట్టిస్తారు. యూనివర్సిటీ అమ్మాయిలు వచ్చేసరికి, 'హిందూ' అబ్బాయి స్పోర్ట్స్ కాలమ్ చూస్తున్నట్లు నటిస్తూనూ, రాకెట్ అబ్బాయి "త్రీకేజిల్స్" త్రాగుతూనూ, హిప్ పాకెట్ లోని మనీ పర్స్ లు కనపడేలా సైడ్ పోజులో నిలబడుతారు. కనీసం ఒక్క ఆడకూతురైనా కన్నెత్తయినా ఆ అబ్బాయిలను చూడకుండా వాళ్ళమానాన వాళ్ళు పోతారు. ఆ అబ్బాయిల అర్థగంట మేకప్ బూడిదలో పోసిన పన్నీరులాగ అవుతుంది.

ఆనందరావుకూడా వారివెనకాలేపోయి వాళ్ళ హాస్టల్ చూడాలనుకుంటాడు. హాస్టల్ కు పోగానే వారు చదువుకుంటారట. పాపం! అవును పోర్షన్స్ ఓపన్ లాగా ఉంటాయాయను. హాస్టల్...సమష్టి జీవితం! అబ్బ! ఎంతకష్టం. విభిన్నదృక్పథాలు, అభిరుచులు, ఆదర్శాలూ కలిగినవారు ఎంతెంతో దూరంనుండి వస్తారు. ఎవరిమనస్సుకూ నొప్పికలగకుండా మాట్లాడాలి, స్నేహంగా ఉండాలి. ఎలాగయినా పోయి చూడాలనుకుంటాడు. 'ఇప్పుడు కాదులే' అంటుంది అంతరాత్మ.

ఆనందరావు తన రూముకుపోయే రోడ్డుకు తిరుగుతాడు. దంపతులు చిలకా గోరింకల్లాగా ఉంటారు-వస్తుంటారు. వారిని చూసేసరికి తను మాత్రం పెళ్ళిచేసుకొని అలా ఎందుకు తిరగకూడదూ అనుకుంటాడు. కాని వెంటనే భయంవేస్తుందతనికి. పెళ్ళి...పెళ్ళాం...పిల్లలు. అయ్యబాబోయ్! తేలగలడూ తను సంసారసాగరలో!

అంతలోకి ఎవరో యువకుడు ఎదురుపడ్డాడు. ఆనందరావుని చూడగానే సన్నగా నవ్వుతాడు. ఆనందరావుకూడా నవ్వి ఊరుకుంటాడు — తనకీ అతనికీ ఏం పరిచయమో తెలియకపోయినా.

రూముకి చేరుతాడు. గుడ్డలు మార్చుకొని రూముప్రక్కనేఉన్న కాఫీహౌస్ లో కాఫీతాగుతుంటాడు. అంతలోకి హిందూ అబ్బాయి ఏడుపు ముఖంతో వస్తాడు. ఆ అమ్మాయిలకు హాస్టల్ దాకాదించి 'రేపనేరోజు ఉందిగదా' అనుకొని తిరిగి వస్తాడు కాబోలు. ఆనందరావు బిల్లు చెల్లించి బీచ్ కి పోతాడు.

ఆవిధంగా గడిచాయి. ఆనందరావు ఉద్యోగంలో చేరిన మొదటి ముప్పైరోజులు. ఆదివారాలుతప్ప - డిశంబరు ఒకటినుండి. ఆదివారం నాడుమాత్రం సాయంత్రం ఆరింటికిపోయి అణాయిస్తాడు. అతనికంటే ముందే పంపిస్తారా అమ్మాయిలు తమవంతు!

డిశంబరు ముప్పయి ఒకటిన మామూలుగానే ఆఫీసునుంచి వస్తున్నాడు. పగలుకూడా ఎముకలు కొరికే చలి. ఆ అడుక్కునే అబ్బాయి చలిలో వణికిపోతున్నాడు. వంటికి చొక్కాకూడా లేదు. చినిగిపోయింది కాబోలు. ఆనందరావు హృదయం కరిగింది.

"రేపు ఒకటోతారీఖు, జీతం వస్తుంది. మొట్టమొదటి జీతంలో ఒక్క పది రూపాయలు పెట్టి ఒకలాగు, చొక్కా కుట్టిస్తే నాకు ఉద్యోగం యిప్పించిన దేముడికి కృతజ్ఞత తెలిపినట్లవుతుంది" అనుకున్నాడు ఆనందరావు.

మర్నాడు జీతం తీసుకొని మధ్యాహ్నం రెండింటికి టైలరుదగ్గరకు పోయాడు గుడ్డలుకొనుక్కుని.

"ఎవరికిబాబూ" అడిగాడు టైలర్

ఎవరికని చెప్పాలో ఆనందరావు కర్థంకాలేదు.

"తమ్ముడికా బాబూ?"

"ఆఁ!" అన్నాడు.

"ఎన్నేళ్ళ?"

"పదకొండు. బాగా కుట్టాలి. సాయంత్రం అయిదింటికి వస్తాను. మర్చిపోకు" అని చెప్పి పోయాడు.

రోజూకన్న గడియారం అతినెమ్మదిగా నడుస్తున్నట్లనిపించింది ఆనందరావుకి. క్షణమొక యుగంగా గడిచింది.

అయిదవగానే టైలర్ దగ్గరకు పోయాడు. టైలర్ కొంచెం ఆలస్యం చేశాడు గుడ్డలీయటంలో. అయిదున్నరయింది టైమ్. ఆనందరావు కమ్మాయిలు కనపడలేదు——అవును! —— అయిదింటికే వెళ్తారుగావారు!

తొందరగా నడిచాడు. గుండెలాగిపోయేంత పని అయింది. ఆశ్చర్యము, భయమూ కలిగాయి,

ఆ అబ్బాయి అక్కడలేడు. ఎక్కడికిపోయినాడు? జ్వరము తగులుతున్నదా... లేదు. అలా జరగటానికి వీలులేదు. అసలు తనలా ఊహించకూడదు. అయితే మరేమయి ఉంటాడు?

ప్రక్కనే ఉన్న కిళ్ళీకొట్టువాన్ని అడుగుతే తెలుస్తుందనుకున్నాడు; అడిగాడు.

"ఆ అబ్బాయా బాబూ! వాళ్ళయ్య ఎవరో ఆఫీసరుగారిదగ్గర పనిచేస్తుంటాడు. ఆ ఆఫీసరుగారికి ట్రాన్సఫరయిందట; ఏ వూరో నాకూ తెలియదు. ఆయనీ ఊరునుంచిపోతూ వాళ్ళను తీసికెళ్ళాడు" అని వచ్చింది జవాబు.

"అబ్బాయికి నాన్నతప్ప ఎవరూలేరా?"

"లేరు బాబూ! చిన్నప్పుడే అమ్మ చనిపోయింది. వాడి అయ్యే ఏదో కొద్దిగా సంపాదిస్తాడు. అది చాలదు. అందుకని రోజూ సాయంత్రం నాలుగింటికి కొడుకుని బుజానెక్కించుకొని ఇక్కడ దించి తన పనిలోకిపోతాడు. మళ్ళీ తనింటికిపోతూ రాత్రి ఏడింటికి వాడ్ని తీసికెళ్తాడు.

ఆనందరావుకా అబ్బాయిమీద జాలి మరీ హెచ్చింది. అతడు మాతృప్రేమంటే ఏమిటో కూడా ఎరుగని అభాగ్య జీవి అని తెలిసేసరికి. మనసులో చాలా బాధపడ్డాడు. రూముకి పోయాడు, గుడ్డలు దాచిపెట్టాడు పెట్టెలో. ఆనాడు బీచికి పోవటం మానేశాడు.

ఆనాటినుండీ అతడు ఆ అబ్బాయికోసం ఎదురు చూస్తుంటాడు—ఏదో ఓనాటికైనా ఆ ఊరువస్తాడనే ఆశతో.

ఇప్పటికా విషయం జరిగి నాలుగుసంవత్సరాలయింది. కాని యింతవరకా అబ్బాయి రాలేదు. ఇప్పుడా అబ్బాయికి పదిహేనోసంవత్సరం వచ్చి ఉంటుంది. ఆనందరావు దాచిన లాగూ-చొక్కా చాలవు. ఆనందరావుకా ఆలోచన తట్టలేదు, తట్టినా ఫరవాలేదు—ఆ అబ్బాయి రావాలిగాని, ఇంకో జత కుట్టించగలడు. ఒక నెల కాఫీ అయినా మానుకొని.

పరితలు ఎవరయినా విశాఖపట్టణం పోతే ఆనందరావును చూడకుండా రాకండి! కష్టమేమీ లేదు. సాయంత్రం అయిదయేసరికి పోస్టుబాక్సు ప్రక్కన నిలబడండి. ముందు "అమ్మాయిలు" వస్తారు. వాళ్ళను మాట్లాడిచూద్దా మనుకున్నారా లాభంలేదు. నాలుగేళ్ళ క్రితం అమ్మాయిలయితే ఫర్వాలేదు. కాని యిప్పటివారితో మాత్రం జాగ్రత్తగా ఉండాలి. మీరు చిన్నవారుగా గాని, పొరుగూరివారిగా గాని కనబడ్డారా మిమ్మల్ని ఏడిపిస్తారు తలకొక మాట అని! వాళ్ళని చూడనట్లు నటించండి. మీవంకే చూస్తారు. అదే మందు! కాస్త రోడ్డుకు పక్కగా నిలబడండి. ఎందుకంటారా? ఈమధ్య మగపిల్లలలాగా ఆడవాళ్ళు చేతివేళ్ళతో కీచైన్సు గిరగిరా తిప్పటం నేర్చుకున్నారు! మీ అదృష్టం బాగా లేకపోతే మీ ముఖాన్నికే తగలవచ్చు. అంతే!

ఒక్క రెండునిముషా లాగండి. ఆనందరావు వస్తాడు.

"ఏమండీ! ఆనందరావుగారూ (అవును! 'ఆనందరావుగారూ' అనే అనండి. తనపేరు మీ కేలా తెలుసా అని అత నాలోచించడు), యిక్కడో అబ్బాయి ('అబ్బాయి' అనే అనండి. 'అడుక్కునే అబ్బాయి' అనకండి. అతను చాలాబాధపడతాడు) ఉండాలి. ఇప్పుడు కనపడడే?" అని అడగండి-ఒక్క అక్షరంకూడా వదలకూడదు-కలపకూడదు.

"అవునండీ! ఆ అబ్బాయి ఇప్పుడీ ఊళ్ళో ఉండటం లేదండీ! రేపో, ఎల్లుండో వస్తాడు. నేనూ ఎదురుచూస్తున్నా నతనికోసమే. ఆ అబ్బాయికోసమే కదండీ! యిప్పుడు బి. యే. ఎకనమిక్సుకి కడుతున్నాను. ఇంగ్లీషు. తెలుగు ప్యాసయినాను మొన్ననే. బి. యే. పూర్తిచేస్తే పెద్ద ఉద్యోగం వస్తుంది. పెళ్ళి చేసుకొంటాను. ఆ అబ్బాయిని నాదగ్గరే అట్టేపెట్టుకుంటాను. ఈ రోడ్డుప్రక్కన కూర్చోనీయను" అని అంటాడు.

"థాంక్స్" అనండి. అతను పోతాడు.

అంతదూరం పోయాం కాబట్టి, 'రాకెట్,' 'హిందూ' అబ్బాయిలనుకూడా చూస్తామంటారా? అది వీలుకాదు. వాళ్ళకి డిగ్రీలు వచ్చి వుంటయ్, ఉద్యోగాలు చేస్తూంటారు. పెళ్ళిళ్ళు కూడా అయిఉంటయ్ - ఇంక అమ్మాయిలకు పోజులు కొట్టాల్సిన అవసరమేముంది వారికి? అందుకనే వాళ్ళిద్దరూ మీకు కనపడరు—

★